సాక్షి
కరీంనగర్
ఆదివారం | 23 | ఏప్రిల్ | 2023



జమ్మికుంట మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని కుప్ప చేస్తున్న రైతు

వర్షానికి కొట్టుకుపోతున్న ధాన్యం



ధాన్యం వర్షార్పణం

- అకాల వర్షంతో అపార నష్టం
- రాళ్లవానతో నేలకొరిగిన వరిపంట
- కళ్ల ముందే కొట్టుకుపోయిన ధాన్యం కుప్పలు
- అంతటా వడగండ్ల వాన



ధాన్యంపై వడగండ్లు



గుమ్లాపూర్‌లో వర్షానికి కొట్టుకుపోతున్న ధాన్యాన్ని కాపాడుకుంటున్న రైతులు

కరీంనగర్‌రూరల్/చొప్పదండి/గంగాధర/మాన కొండూర్/శంకరపట్నం/జమ్మికుంట/: అకాల వర్షం మరోసారి బీభత్సం సృష్టించింది. ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వాన రైతాంగాన్ని కోలుకోకుండా చేసింది. శనివారం సాయంత్రం 5 గంటలకు కరీంనగర్ మండలంలోని జూబ్లీనగర్, ఫకీర్‌పేట, చామనపల్లి, దుబ్బపల్లి, చెర్లభూత్కూర్, మొగ్దుంపూర్, ఇరుకుల్ల, తాహెర్‌కొండాపూర్, బహుదూర్‌ఖాన్‌పేట తదితర గ్రామాల్లో కురిసిన అకాల వర్షంతో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది. వర్షం నుంచి ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు పడరానిపాట్లు పడ్డారు. టార్పాలిన్లు, పరదాలను కప్పినప్పటికీ ఈదురుగాలుల వేగానికి కొట్టుకపోయాయి. కొందరు రైతులకు టార్పాలిన్లు లేకపోవడంతో ధాన్యం తడిసి ముద్దయింది. మామిడికాయలు నేలరాలాయి. జూబ్లీనగర్–చామనపల్లిరోడ్డులో గాలికి పెద్దచెట్టు కూలిపడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తాహెర్‌కొండాపూర్‌లో రాళ్ల వాన పడటంతో వరిపంట గింజలన్నీ నేలరాలాయి. పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

- చొప్పదండితోపాటు, గుమ్లాపూర్, మల్లన్నపల్లి, సాంబయ్యపల్లి, రుక్మాపూర్, కొలిమికుంట, చాకుంట, భూపాలపట్నం, వెదురుగట్ట గ్రామాల్లో వడగండ్లు, ఈదురు గాలుల వర్షం బీభత్సం సృష్టించింది. పోయిన నెలలోనే కోలుకోలేని దెబ్బతీసిన ప్రకృతి.. మరోసారి పంజా విసరడంతో రైతులు దిక్కుతోచని స్థితికి చేరిపోయారు. ధాన్యం కుప్పలపై కవర్లు కప్పినా ఈదురు గాలులకు కొట్టుకుపోయాయి. ధాన్యం తడిచిపోయింది. మార్కెట్ యార్డులో తడిచిన ధాన్యాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం చుక్కరెడ్డి పరిశీలించారు. రైతులు అధైర్య పడవద్దని భరోసానిచ్చారు. గంగాధర, రామడుగు మండలాల్లో కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం తడిసిపోయింది. వారం రోజుల క్రితం వీచిన గాలులకు మామిడి తోటలు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయి. శనివారం కురిసిన గాలివాన, వడగండ్లకు మిగిలిన కాయలు సైతం రాలిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశా.
- మానకొండూర్ మండలంలోని వేగురుపల్లి, ఊటూరు, పచ్చునూర్ గ్రామాలలో వడగండ్ల వానకు కల్లాల్లో పోసిన వరిధాన్యం తడిసింది. వరి పంట దెబ్బతింది. శంకరపట్నం వ్యవసాయ మార్కెట్‌లో ఆరబోసిన ధాన్యం తడిసింది. రైతులు కవర్లు కప్పకపోవడంతో తడిసి ముద్దయ్యింది. జమ్మికుంట పట్టణం, మండలంలోని కొనుగోలు కేంద్రాల్లోని వరి ధాన్యం తడిసింది. ఇల్లందకుంట మండలం వ్యాప్తంగా పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది.

అకాల వర్షంతో నష్టపోయాం..



జమ్మికుంటలోని పాత వ్యవసాయ మార్కెట్‌లోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రానికి వారం రోజుల క్రితం ధాన్యం అమ్మకానికి తీసుకువచ్చాను. అధికారులు తాలు పట్టాలని సూచించారు. ఈ రోజు తాలు పట్టి, సంచులు ఇవ్వాలని కోరాం. అధికారులు శని, ఆదివారాలు సెలవులని సోమవారం ఇస్తామని చెప్పారు. రాత్రి కురిసిన అకాల వర్షంతో ధాన్యం మురుగు కాల్వలోకి కొట్టుకుపోయింది. నోటికాడికి వచ్చిన బువ్వ గుంచుకున్నట్టు అయింది. ప్రభుత్వం ఆదుకోవాలి. – తిరుమలేశ్, వల్భాపూర్, వీణవంక మండలం



తాహెర్‌కొండాపూర్‌లో వరిలో వడగండ్లు



మొగ్దుంపూర్‌లో తడిసిన ధాన్యం చూపిస్తున్న రైతు



చొప్పదండిలో..



ఫకీర్‌పేటలో కొట్టుకుపోతున్న మిర్చి



చొప్పదండి: భూపాలపట్నంలో ఇంటిపై పడిపోయిన తాటిచెట్టు



గంగాధర: దత్తోజిపల్లిలో కురిసిన వర్షానికి తడిసిన ధాన్యం

భయం గుప్పిట్లో అన్నదాత | అకాల వర్షాలతో రైతుల ఉరుకులు, పరుగులు.. -IIలో▸



భక్తిశ్రద్ధలతో రంజాన్





ఈద్ ఉల్ ఫీతర్‌ను శనివారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చింతకుంట, సాలేహ్‌నగర్ ఈద్గాల వద్ద పెద్ద సంఖ్యలో ముస్లింలు ప్రార్థనలు చేశారు. మత పెద్దలు సందేశం ఇచ్చారు. అటవీ కార్యాలయం ఎదురుగా, ఇతర ప్రాంతాల్లో ఉన్న సమాధుల వద్ద నివాళి అర్పించారు. బంధువులను, స్నేహితులను ఆలింగనాలు చేసుకుని ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈద్గాల వద్ద పోలీస్ యంత్రాంగం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది.
– కరీంనగర్‌కల్చరల్

రైతులను ఆదుకుంటాం

కరీంనగర్: అకాల వర్షానికి చొప్పదండితో పాటు పలు ప్రాంతాల్లో నష్టపోయిన పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ శనివారం కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్‌కు సూచించారు. మరిన్ని రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ నివేదిక ఇచ్చిన అనంతరం ప్రభుత్వపరంగా ఆదుకుంటామని వినోద్ కుమార్ తెలిపారు.

ఎంపీపీకి సన్మానం

తిమ్మాపూర్: రాష్ట్రపతి, కేంద్ర మంత్రి చేతుల మీదుగా నానాజీ దేశ్ ముఖ్ సర్వోత్తమ్ పంచాయతీ సతత్ వికాస్ పురస్కారం, అవార్డును అందుకున్న ఎంపీపీ కేతిరెడ్డి వనితను శనివారం కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ సన్మానించారు. క్యాంపు కార్యాలయంలో కలెక్టర్‌తోపాటు జెడ్పీ సీఈవో ప్రియాంక సత్కరించారు. జిల్లాలోని మిగతా మండలాలకు తిమ్మాపూర్ ఆదర్శంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్ రెడ్డి, ఎంపీవో కిరణ్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

వీణవంక : పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. పార్టీ బలోపేతం, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలపై కార్యకర్తలకు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ మాడ గౌతం రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రామిడి ఆదిరెడ్డి, చేపూరి రాజు, బొంగోని సదానందం గౌడ్, మోటం చిన్న వెంకటేశ్, సంది సురేందర్ రెడ్డి, మారం తిరుపతి రెడ్డి రెడ్డి, కొండల్ రెడ్డి, తదితరులున్నారు.

ఒకరి రిమాండ్

సుల్తానాబాద్/కాల్వ శ్రీరాంపూర్: బైండోవర్‌ను ఉల్లంఘించిన కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లికి చెందిన సంపంగి మహేశ్‌ను కరీంనగర్ జైలుకు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ ఆనందరావు తెలిపారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.మహిపాల్ రెడ్డి ఆదేశాల మేరకు మహేశ్‌ను కాల్వశ్రీరాంపూర్ తహసీల్దారు ఎదుట హాజరుపరిచారు. ఆయన విచారణ చేపట్టి జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. గతేడాది నాటుసారా తయారు చేస్తూ పట్టుబడగా.. తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. అదే నేరం చేస్తూ ఎక్సైజ్ అధికారులకు పట్టుబడ్డాడు. అతడిని అరెస్టు చేసి కరీంనగర్ జైలుకు తరలించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు


చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

హుజూరాబాద్ రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సింగాపూర్ గ్రామంలోని బస్టాప్ వద్ద గ్రామానికి చెందిన ముద్రవేని సదానందం, హుజూరాబాద్‌కు చెందిన వంగ కరుణాకర్ ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

భయం గుప్పిట్లో అన్నదాత

- అకాల వర్షంతో రైతుల ఉరుకులు, పరుగులు
- కొన్ని గ్రామాలలో నేలకొరిగిన వరి పైరు
- కొనుగోలు కేంద్రాలలో తడిసిన ధాన్యం
- జిల్లాలో 95.382 హెక్టార్లలో వరి సాగు
- కోత దశలో 60 వేల హెక్టార్లు
- ఆందోళనలో రైతన్నలు


మొగ్దుంపూర్‌లో ధాన్యంపై టార్పాలిన్లు కప్పుతున్న రైతులు

వీణవంక/కరీంనగర్ అర్బన్: అకాల వర్షం రైతులను ఉక్కిరిబిక్కిరి చేసింది. ఒక్కసారిగా వర్షం రావడంతో రైతులు పొలాలకు పరుగులు పెట్టారు. ఆరబోసిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు నానా తంటాలు పడ్డారు. కొన్ని గ్రామాలలో ధాన్యం తడిసింది. టాటిపత్రులు దొరకకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో పోసిన ధాన్యం పూర్తిగా తడిసింది. మూడేళ్లుగా జిల్లాలో ఇదే పరిస్థితి నెలకొంది. పంట చేతికివచ్చే సమయంలో అకాల వర్షాలు రైతులను కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. అసలే ఈ సారి తెగుళ్లతో నష్టపోయారు. మరోసారి అకాల వర్షాలు రైతులను కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. జిల్లాలో 95.382 హెక్టార్లలో వరి సాగు చేసినట్లు అధికారులు చెప్తున్నారు. ఇందులో ఇప్పటివరకు 10 వేల హెక్టార్లలో వరి కోతలు పూర్తి కాగా మరో 60 వేల హెక్టార్లలో కోత దశలో ఉన్నాయి. జిల్లాలోని కరీంనగర్, చొప్పదండి, మానకొండూరు, వీణవంక మండలాలలో ఈదురుగాలులతో వరి నేలకొరిగింది. ఆయా మండలాల్లో ధాన్యం తడిసింది.

మూడేళ్లుగా ఇదే పరిస్థితి..

జిల్లా రైతులను అకాల వర్షాలు, వడగండ్లు మూడేళ్లుగా వేధిస్తున్నాయి. పంట చేతికి వచ్చే సమయంలో రైతులను కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. రెండేళ్ల క్రితం అకాల వర్షాలకు హుజూరాబాద్ నియోజకవర్గంలో 5 వేల ఎకరాలలో మక్క, వరి పంటలు దెబ్బతిన్నాయి. మార్చిలో కురిసిన వర్షంతోనూ నష్టం వచ్చింది.

పేరుకుపోయిన నిల్వలు

ఆలస్యంగా కేంద్రాలను ప్రారంభిస్తుండగా.. కొన్ని గ్రామాలలో ఇప్పటివరకు ఏర్పాటుకు నోచుకోలేదు. అదేవిధంగా ఐకేపీ, పీఏసీఎస్ సెంటర్లలో టాటిపత్రులు అందుబాటులో లేకపోవడంతో కిరాయి పరదాలు తెచ్చుకోవాల్సి వస్తోంది. ఒక్కో పరద కిరాయి రోజుకు రూ.20 చొప్పున రైతులు చెల్లిస్తున్నారు. ఉన్నతాధికారులు కలుగజేసుకొని తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంతోపాటు టాటిపత్రులను అందుబాటులో ఉంచాలని రైతులు కోరుకుంటున్నారు.

కమ్ముకుంటున్న మేఘాలు

నాలుగు రోజుల క్రితం ఉష్ణోగ్రతలు గరిష్ఠ స్థాయికి చేరగా మేఘాలు కమ్ముకోవడంతో వాతావరణం చల్లబడింది. మండు వేసవిలో మేఘాలేర్పడటంతో గంటల వ్యవధిలో వర్షాలు కురుస్తున్నాయి. 26 వరకు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ ప్రకటించగా అన్నదాతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అకాల వాన కొనసాగితే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తిప్పలు అనివార్యం కాగా కోత కోయాలంటే కష్టమే. గింజ రాలిపోనుండగా కేవలం కర్ర మాత్రమే మిగలనుంది. దిగుబడి ఎకరాన రెండు క్వింటాళ్లు మించే పరిస్థితి ఉండదు.

‘భట్టి’ పాదయాత్రలో పసలేదు


సమావేశంలో మాట్లాడుతున్న జీవీఆర్

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా ఛైర్మన్ జీవీ రామకృష్ణా రావు

మానకొండూర్ రూరల్ : జిల్లాలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేస్తున్న పాదయాత్రలో పసలేదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా ఛైర్మన్ జీవీ రామకృష్ణా రావు ఎద్దేవా చేశారు. శనివారం మండలంలోని పలుగ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన అనంతరం ఊటూర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు కేవలం సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ నాయకులను నిందించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. ధరణి పోర్టల్‌ను కాంగ్రెస్, బీజేపీ నాయకులు రద్దు చేయాలనడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై ఎంపీ బండి సంజయ్‌ను విమర్శించకపోవడం అంతర్యమేంటని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. జెడ్పీటీసీ శేఖర్, సర్పంచులు సుదర్శన్, పృథ్వీరాజ్, ఉపసర్పంచులు నెల్లి మురళి, రేమిడి శ్రీనివాస్ రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు ప్రదీప్ రెడ్డి, ఉపాధ్యక్షుడు సతీశ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన ఓటర్ల జాబితా పరిశీలన

కోరుట్ల : పట్టణంలో ఓటర్ల జాబితాలో 5 శాతం కంటేఎక్కువ తొలగించిన ఓటర్ల జాబితాను ఆర్డీవో వినోద్‌కుమార్ శనివారం పరిశీలించారు. పట్టణంలోని 140, 143, 144,179, 151, 152, 168, 181, 189 పోలింగ్ బూత్‌ల్లో తొలంగించిన జాబితాలు ఆయా బీఎల్‌వోలతో ప్రజల సమక్షంలో బహిరంగంగా చదివి వినిపించారు. క్లైమ్ రిజిస్టర్లు పరిశీలించి తొలగించిన ఓట్లు సక్రమమేనా అని తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్, ఆర్‌ఐ భూమేశ్, కౌన్సిలర్లు పాల్గొన్నార

కార్మికుల ఆరోగ్యంపై యాజమాన్యం నిర్లక్ష్యం


మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు వైవీ.రావు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి కార్మికుల ఆరోగ్యంపై యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఏఐటీయూసీ ఉప కార్యదర్శి వైవీ.రావు అన్నారు. శనివారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. కార్మిక కుటుంబాలు సింగరేణి ఆసుపత్రికి వెళ్తే సరైన ట్రీట్మెంట్, మందులు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఓసీపీ–1లో విధులు నిర్వహిస్తున్న ఆపరేటర్ తల్లిని సింగరేణి ఆసుపత్రిలో చేర్పిస్తే హైదరాబాద్‌కు రెఫర్ చేస్తున్నారని తెలిపారు. మెడికల్ బిల్లులు పెట్టుకుని ఎంతోమంది కార్మికులు ఏళ్ల తరబడి బిల్లు రాక ఎదురుచుస్తున్నారని పేర్కొన్నారు. యాజమాన్యం స్పందించి సింగరేణి ఆసుపత్రిల్లో సరైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ఎల్.ప్రకాశ్, బ్రాంచ్ కార్యదర్శి రాజారత్నం, రాంచందర్, తిరుపతి, సమ్మయ్య, శ్రీనివాస్, రాములు తదితరులు పాల్గొన్నారు.

తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి


రాజయ్య (ఫైల్)

జమ్మికుంట: తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతిచెందాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కోరపల్లి గ్రామానికి చెందిన మొగిలిపాక రాజయ్య (61) శనివారం సాయంత్రం కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కుతుండగా కింద పడిపోయాడు. చుట్టుపక్కల వారు గమనించి చికిత్స నిమిత్తం జమ్మికుంటకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హుజూరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య రమ, కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి భార్య రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ బార్పాటి రమేశ్ తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత..

కరీంనగర్ క్రైం: పురుగుల మందు తాగి ఆత్మాహత్యా యత్నానికి యత్నించిన ఓ వివాహిత చికిత్స పొందుతూ మృతిచెందింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం కోనసముద్రంకు చెందిన భార్గవి (24)కి నగరంలోని గౌతమినగర్‌కు చెందిన గొల్లపల్లి రాజు అలియాస్ సాగర్‌తో 2018లో ప్రేమ వివాహం జరిగింది. కొంతకాలంగా భర్త, అత్త, ఆడపడుచు వారు కట్నం కోసం వేధిస్తున్నారు. ఈనెల 20న మళ్లీ వేధించడంతో మార్కెట్ సమీపంలోని ఓ లాడ్జి వద్ద పురుగుల మందు తాగింది. స్థానికులు చికిత్స నిమిత్తం 108లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భార్గవి కుటుంబ సభ్యులు కరీంనగర్‌కు వచ్చి నిజామాబాద్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి ఆమె మృతిచెందింది. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మరో ఘటనలో వృద్ధుడు..

కరీంనగర్ క్రైం: ఓ యువకుడు వృద్ధుడిని తలపై బండరాయితో మోదడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...అశోక్‌నగర్‌లోని సయ్యద్ యూసుఫ్‌కు చెందిన ఇంట్లో ఒక గదిలో రిటైర్డ్ టీచర్ ఎండీ షరీఫ్ (75)తో పాటు ఎండీ జహీరొద్దీన్ ఉంటున్నారు. షరీఫ్ జహీరొద్దీన్‌కు పదే పదే పనులు చెప్పడంతో కోపోద్రిక్తుడైన జహీరొద్దీన్ ఈనెల 19న షరీఫ్ తలపై బండరాయితో తలపై మోదాడు. స్థానికులు ఇంటి యజమాని యూసుఫ్‌కు సమాచారం అందించగా చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. దీనిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

హైనాదాడిలో లేగదూడలు హతం


కళేబరాన్ని పరిశీలిస్తున్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్

చిగురుమామిడి : మండలంలోని కొండాపూర్, సుందరగిరి గ్రామాలకు చెందిన రాగుల వెంకటేశం, మెడబోయిన తిరుపతికి చెందిన రెండు లేగదూడలను హైనా దాడిచేసి హతమార్చినట్లు బాధిత రైతులు తెలిపారు. వ్యవసాయ బావుల వద్ద లేగదూడలను కట్టివేయగా శనివారం ఉదయం దాడిచేసి హతమార్చినట్లు తెలిపారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శేఖర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. రూ.30వేల వరకు నష్టం వాటిలినట్లు బాధిత రైతులు వాపోయారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరారు.

నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం పోరాటం


మాట్లాడుతున్న రాజన్న

గోదావరిఖని: నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం పోరాటం చేయాలని కరీంనగర్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కె.రాజన్న పిలుపునిచ్చారు. శనివారం లెనిన్ 153వ జయంతిని స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో నిర్వహించారు. దోపిడీ వ్యవస్థను నిర్మూలించి దాని స్థానంలో నూతన ప్రజాస్వామిక విప్లవంతోనే భూమి, భుక్తి, విముక్తి సాధ్యమన్నారు. ప్రజల విముక్తి కోసం వీరోచితంగా పోరాడి అసువులు బాసిన లెనిన్‌కు రెండు నిమిషాలు మౌనం పాటించి జోహార్లు అర్పించారు. కార్యక్రమానికి సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు నరేశ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు చిలుక శంకర్, ఎం.దుర్గయ్య, కె.మొగిలి, బి.బుచ్చయ్య, వి.సదానందం, కె.లింగమూర్తి, మహేందర్, బొట్టు రవికుమార్, మంగ, రజిత, మొండన్న, సుధాకర్, సాంబయ్య, నర్సయ్య, గుండు రాజయ్య, ఆర్.రాయమల్లు, బాలకృష్ణ, మధూకర్, అన్వేశ్, శ్రావణ్ పాల్గొన్నారు.

లెనిన్ పోరాట స్ఫూర్తితో పేదలకు ఇళ్ల స్థలాలు

గోదావరిఖని: లెనిల్ పోరాట స్ఫూర్తితో పేదలకు ఇళ్ల స్థలాలు సాధించుకుందామని సీపీఎం రాష్ట్ర నేత భూపాల్ తెలిపారు. స్థానిక రాజ్యలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో భూపోరాట కేంద్రాల కార్యకర్తల రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా లెనిన్ 153వ జయంతిని నిర్వహించారు. పాలకులు ప్రజలను ఎలా గౌరవించాలో ఆచరణలో నిరూపించిన లెనిన్ మార్గం విలువైందన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దేశ అభివృద్ధికి కాకుండా సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందన్నారు. పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని పార్టీ ఆధ్వర్యంలో భూపోరాటాలు చేస్తున్నామని తెలిపారు. నాయకులు ముత్యంరావు, వై.యాకయ్య, ఎం.రామాచారి, లావణ్య, భిక్షపతి, నాగమణి, ఉపేందర్, సంజీవ్, నాగలక్ష్మి, లక్ష్మారెడ్డి, ఉపేందర్ పాల్గొన్నారు.

సైద్ధాంతికకర్త లెనిన్

జ్యోతినగర్: కమ్యూనిస్టు విప్లవోద్యమ సైద్ధాంతికకర్త లెనిన్ అని సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ అన్నారు. ఆటోనగర్‌లోని యూనియన్ కార్యాలయంలో లెనిన్‌కు నివాళులర్పించారు. మోదీ తీసుకొస్తునన ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. డివిజన్ కార్యదర్శి తోకల రమేశ్, నాయకులు గుమ్మడి వెంకన్న, అడేపు శంకర్, కోడిపుంజుల లక్ష్మీ, చంద్రయ్యతో ఉన్నారు.

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి

యైటింక్లయిన్‌కాలనీ: పోడు భూములు సాగు చేసుకుంటున్న వారికి పట్టా ఇవ్వాలని సీపీఎం(ఎంఎల్) న్యూడెమోక్రసి జిల్లా నాయకులు బి.అశోక్ అన్నారు. స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో లెనిన్‌కు నివాళి అర్పించారు. నాయకులు రాజనర్సు, బుచ్చమ్మ, లింగయ్య, ప్రేమ్ కుమార్, శారద, లత, కవిత, రమ, కళావతి తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం


కొండ మమత

చొప్పదండి: మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన కొండ మమత (24) అనే మతి స్థిమితం లేని యువతి అదృశ్యమైనట్లు ఎస్సై ఉపేంద్రచారి తెలిపారు. మమత కొంతకాలంగా మతి స్థిమితంతో బాధపడుతోంది. ఈనెల 21న ఇంట్లోంచి బయటకు వెళ్లింది. కుటుంబ సభ్యులు తెలిసినా చోటల్లా గాలించినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేశామని, ఆచూకీ తెలిసిన వారు 8712670766 నెంబర్‌లో సంప్రదించాలని ఎస్సై కోరారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం


సన్మానిస్తున్న అధికారులు

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 పరిధి జీడీకే–5 ఓసీపీ మేనేజర్‌గా పనిచేస్తూ ప్రాజెక్టు అధికారిగా పదోన్నతిపై ఆర్కే ఓసీపీకి వెళ్తున్న గోవిందరావును శనివారం ఘనంగా సన్మానించారు. జీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో శాలువాలతో సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జీఎం చంద్రశేఖర్, ఏరియా ఇంజినీర్ రాంమూర్తి, ఎస్‌ఓటూ జీఎం రాంమోహనన్, చిలుక శ్రీనివాస్, రామక్రిష్ణ, నరేస్‌చక్రవర్తి, ఆంజనేయులు, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

మూలనపడ్డ కంప్యూటర్లు

- గ్రామ పంచాయతీల్లో అందని పౌరసేవలు
- ధ్రువపత్రాల కోసం మండల కేంద్రాలకు పయనం
- సమస్యను పరిష్కరించాలని కోరుతున్న ప్రజలు



గ్రామ పంచాయతీ కార్యాలయం

కరీంనగర్ : ఈ–పంచాయతీ కింద ఎంపికైన పల్లెల్లో ధ్రువపత్రాల జారీకి ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లావ్యాప్తంగా గ్రామ పంచాయితీల్లో కంప్యూటర్లు ఏర్పాటు చేసి ఆపరేటర్లును నియమించిన అధికార యంత్రాంగం సకాలంలో పంచాయితీ కార్యాలయాలకు ఆన్‌లైన్ నెట్ సౌకర్యం కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తోంది. దీంతో చాలాచోట్ల పంచాయితీల్లో కంప్యూటర్లు మూలనపడుతున్నాయి. కొన్నిచోట్ల ఆన్‌లైన్ సౌకర్యం, ప్రింటర్లు, స్కానర్లు లేక పౌర సేవలకు విఘాతం కలుగుతోంది. వివిధ ధ్రువపత్రాలు కావాలంటే ఎంపీడీవో కార్యాలయాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ–పంచాయతీ కింద ఎంపికైన మెజారిటీ గ్రామ పంచాయితీల్లో ఇదే దుస్థితి నెలకొంది. క్లస్టర్ పంచాయతీలకు ఆన్‌లైన్ సేవలు కల్పించే పనులను గతంలో బీఎస్ఎన్ఎల్ సంస్థకు అప్పగించారు. కొన్నిచోట్ల కేబుల్ ద్వారా కనెక్షన్లు ఇచ్చి అర్ధాంతరంగా నిలిపివేయడంతో మరో సంస్థకు బాధ్యతలు అప్పగించారు. కొన్నింటికీ కనెక్షన్లు ఇవ్వగా మధ్యలో మిషన్ భగీరథ కోసం రోడ్లు తవ్వడంతో చాలా చోట్ల కేబుళ్లు తెగిపోయాయి. ప్రస్తుతం టీ–ఫైబర్ నెట్ సౌకర్యం కల్పించే పనులు కొనసాగుతున్నా కొన్ని అవాంతరాలతో గ్రామ పంచాయితీలకు నెట్ సౌకర్యం లేదు. దీంతో ప్రజలు ధ్రువపత్రాల జారీకోసం పంచాయితీలో మ్యాన్‌వల్‌గా దరఖాస్తులు తీసుకొని మీ సేవ, మండల కేంద్రాల్లో ఎంపీపీ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

నమోదు కోసం

పంచాయతీల్లో జనన, మరణ ధ్రువపత్రాలు, ట్రేడ్ లైసెన్సుల జారీ, వసూలు చేసిన ఆస్తిపన్నుల రసీదులు, అభివృద్ధి పనులకు వెచ్చించిన నిధుల వ్యయం వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాల్సి ఉండగా ఆన్‌లైన్ సదుపాయం లేక కార్యదర్శులే ఎంపీడీవో కార్యాలయాలకు వెళ్లి అప్‌లోడ్ చేస్తున్నారు.

అటకెక్కిన ఈ–పాలన

- జిల్లాలో 313 గ్రామ పంచాయితీలుండగా 135 క్లస్టర్ పంచాయతీలకు ప్రభుత్వం కంప్యూటర్లు కేటాయించింది. తాజాగా మరో 150 గ్రామ పంచాయితీలకు ఈ పంచాయితీ కింద కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానింగ్, ఇంటర్‌నెట్ సేవలు కల్పించే పనిలో అధికార యంత్రాంగం ప్రయత్నిస్తున్నా ప్రజలకు పౌర సేవలు అందడం లేదు. పరిపాలనా సౌలభ్యం కోసం ప్రభుత్వం సాంకేతికతను అందుబాటులోకి తీసుకవచ్చే ప్రయత్నం చేస్తుంటే గతంలో వేసిన కేబుళ్లు తెగిపోవడం, తదితర కారణాతో పౌరసేవలకు ఆటంకం కలుగుతోంది. దీంతో ప్రజలు ఎంపీపీ, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న పరిస్థితి నెలకొంది.

స్థానికంగా అప్‌లోడ్ చేయాలి



పౌరసేవల ధ్రువపత్రాలను స్థానికంగా అప్‌లోడ్ చేసుకోవాలి. కొన్నిచోట్ల కంప్యూటర్లు నిరుపయోగంగా ఉండటం వాస్తవమే. మరమ్మతులు, ప్రింటర్లకు ఏవైనా నిధులు అవసరమైతే పంచాయతీ తీర్మానం చేసి ఖర్చు చేసుకోవాలి. జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయితీలకు కంప్యూటర్ ఇతర పరికరాలు అందజేశాం. టీ–ఫైబర్ నెట్ సౌకర్యం లేకపోవడంతో సర్టిఫికెట్ల జారీకి విఘాతం ఏర్పడుతోంది. త్వరలోనే ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించి ఇబ్బందులు లేకుండా చూస్తాం. ప్రజలకు అన్నిరకాల ధ్రువపత్రాలను పంచాయితీలోనే జారీచేస్తాం.

– వీరబుచ్చయ్య, డీపీవో



సెమీస్‌లో ఓడిన సాకేత్-యూకీ జోడీ

జీఎండబ్ల్యూ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో సాకేత్ మైనేని-యూకీ బాంబ్రీ (భారత్) పోరాటం ముగిసింది. జర్మనీలోని మ్యూనిక్‌లో శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో సాకేత్-యూకీ జంటకు ఓటమి ఎదురైంది. 84 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో సాకేత్-యూకీ 6-7 (4/7), 3-6తో అలెగ్జాండర్ ఎర్లెర్-లుకాస్ మీడ్లెర్ (ఆస్ట్రియా) చేతిలో ఓడిపోయారు. మ్యాచ్ మొత్తంలో ఐదు ఏస్‌లు సంధించిన సాకేత్, యూకీ ఐదు డబుల్ ఫాల్ట్‌లు కూడా చేయడం గమనార్హం. భారత జోడీ ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేసి తమ సర్వీస్‌ను రెండు సార్లు కోల్పోయింది. సెమీస్‌లో ఓడిన సాకేత్-యూకీలకు 9,330 యూరోల (రూ. 8 లక్షల 47 వేలు)ప్రైజ్‌మనీతోపాటు 90 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

సురేఖ ‘డబుల్’ ధమాకా



స్వర్ణాలు సాధించినందుకు చాలా ఆనందంగా ఉంది. నా అనుభూతిని మాటల్లో వర్ణించలేను. నేనీ స్థాయికి చేరుకోవడానికి ఎంతో మంది కృషి ఉంది. వారందరికీ ధన్యవాదాలు. ఈ సీజన్‌లో మరో మూడు ప్రపంచకప్‌లు, ప్రపంచకప్ ఫైనల్స్, ప్రపంచ చాంపియన్‌షిప్, ఆసియా క్రీడలు ఉన్నాయి. ఈ మెగా ఈవెంట్స్‌లోనూ పతకాలు సాధించడమే నా లక్ష్యం. - సురేఖ

2 ప్రపంచకప్ టోర్నీ వ్యక్తిగత విభాగంలో సురేఖ సాధించిన పతకాలు. 2022లో సురేఖ రజతం నెగ్గగా, ఈసారి స్వర్ణం సాధించింది.

11 ప్రపంచకప్ టోర్నీలలో ఓవరాల్‌గా సురేఖ నెగ్గిన పతకాలు. ఇందులో మూడు స్వర్ణాలు, మూడు రజతాలు, నాలుగు కాంస్యాలు ఉన్నాయి.

2 ప్రపంచకప్ టోర్నీల్లో మిక్స్‌డ్ టీమ్‌లో సురేఖ నెగ్గిన స్వర్ణాలు. 2022లో అభిషేక్ వర్మతో కలిసి తొలిసారి స్వర్ణం గెలిచింది.

ప్రపంచకప్ ఆర్చరీ టోర్నీలో రెండు స్వర్ణ పతకాలు నెగ్గిన ఆంధ్రప్రదేశ్ అమ్మాయి



అంటాల్యా (తుర్కియే): ఆద్యంతం నిలకడగా రాణించిన భారత స్టార్ ఆర్చర్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ తన కెరీర్‌లో గొప్ప ప్రదర్శన చేసింది. సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ... ఎన్నో ఏళ్లుగా ఊరిస్తున్న ప్రపంచకప్ టోర్నీ వ్యక్తిగత స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. శనివారం జరిగిన ఈవెంట్స్‌లో విజయవాడకు చెందిన 26 ఏళ్ల జ్యోతి సురేఖ గురి తప్పని లక్ష్యంతో మెరిపించి ఏకంగా రెండు స్వర్ణ పతకాలను దక్కించుకొని డబుల్ ధమాకా సృష్టించింది. ముందుగా కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో తొలిసారి ప్రపంచకప్ టోర్నీలో ఆడుతున్న ఓజస్ ప్రవీణ్ దేవ్‌తలె (మహారాష్ట్ర)తో కలిసి పసిడి పతకాన్ని సాధించింది. చెన్ యి సువాన్-చెన్ చి లున్ (చైనీస్ తైపీ) జోడీతో జరిగిన ఫైనల్లో జ్యోతి సురేఖ-ఓజస్ ప్రవీణ్ 159-154 పాయింట్ల తేడాతో గెలిచింది. తొలి మూడు రౌండ్‌లలో 40కి 40 పాయింట్లు స్కోరు చేసిన భారత జోడీ చివరి రౌండ్‌లో 39 పాయింట్లు సాధించింది. ఒక పాయింట్ తేడాతో ప్రపంచ రికార్డును సమం చేసే అవకాశాన్ని చేజార్చుకుంది. 2018లో అంటాల్యాలోనే జరిగిన ప్రపంచకప్‌లో దక్షిణ కొరియా జట్టు 160కి 160 పాయింట్లు స్కోరు చేసింది.

వరల్డ్ నంబర్‌వన్‌ను ఓడించి...

మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో జ్యోతి సురేఖ ప్రపంచకప్ టోర్నీల చరిత్రలో తొలిసారి పసిడి పతకాన్ని ముద్దాడింది. శనివారం జరిగిన ఫైనల్లో ప్రపంచ 11వ ర్యాంకర్ సురేఖ 149-146తో (30-30, 30-29, 29-29, 30-29, 30-29) ప్రపంచ మూడో ర్యాంకర్ సారా లోపెజ్ (కొలంబియా)పై గెలిచి 20వ ప్రయత్నంలో చాంపియన్‌గా అవతరించింది. 2011 నుంచి అంతర్జాతీయ టోర్నీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న సురేఖ సెమీఫైనల్లో 148-146తో (29-29, 30-30, 30-30, 29-29, 30-28) ప్రపంచ నంబర్‌వన్ ఇలా గిబ్సన్ (బ్రిటన్)పై సంచలన విజయం సాధించింది.

లక్నో చేజేతులా...

గెలిచే దారిలో ఓటమిని పిలవడం అంటే ఇదే! 19 ఓవర్లలో లక్నో స్కోరు 124/3. ఇంకా 7 వికెట్లున్న జట్టు 6 బంతుల్లో 12 పరుగులు చేస్తే చాలు. పైగా తొలి ఓవర్ నుంచి ఆడుతున్న ఓపెనర్ కేఎల్ రాహుల్ అర్ధసెంచరీ చేసి క్రీజులో ఉన్నాడు. ఆఖరి ఓవర్ మొదటి బంతికి 2 పరుగులు కూడా చేశాడు. 5 బంతుల్లో 10 పరుగులు సులభంగానే కనిపించింది. కానీ మోహిత్ శర్మ వేసిన తర్వాతి 2 బంతులు రాహుల్, స్టొయినిస్‌లను బోల్తా కొట్టించాయి. ఇంకో 2 బంతులకు ఆయుశ్ బదోని, దీపక్ హుడా రనౌటయ్యారు. అంతే ఆఖరి బంతి మిగిలుంది కానీ... టైటాన్స్ గెలిచింది! సమీకరణం 1 బంతికి 8 పరుగులు కాగా... మోహిత్ కనీసం ఒక పరుగైనా ఇవ్వలేదు. దీంతో ఎవరూహించని విజయం గుజరాత్ గూటికి చేరింది.

- నెగ్గాల్సిన మ్యాచ్‌లో 7 పరుగులతో ఓటమి
- ఆఖరి ఓవర్లో గుజరాత్‌ను గెలిపించిన మోహిత్
- రాహుల్ శ్రమ వృథా
- రాణించిన పాండ్యా, సాహా



ఆయుశ్ బదోనిని రనౌట్ చేస్తున్న మోహిత్ శర్మ

లక్నో: మోహిత్ శర్మ స్వింగ్ (2/17)తో గుజరాత్ టైటాన్స్ కింగ్ అయ్యింది. అనూహ్యంగా ఓటమి కోరల్లోంచి గెలుపు మజిలీకి చేరింది. అలవోకగా గెలవాల్సిన చోట లక్నో సూపర్ జెయింట్స్ వరుస నాలుగు బంతుల్లో నాలుగు వికెట్లు చేజార్చుకొని ఓటమిని పలకరించింది. మొదట గుజరాత్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 135 పరుగులు చేసింది. కెప్టెన్ హార్దిక్ పాండ్యా (50 బంతుల్లో 66; 2 ఫోర్లు, 4 సిక్సర్లు), వృద్ధిమాన్ సాహా (37 బంతుల్లో 47; 6 ఫోర్లు) రాణించారు. లక్నో బౌలర్లలో కృనాల్ పాండ్యా, స్టొయినిస్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన లక్నో సూపర్ జెయింట్స్ 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 128 పరుగులకే పరిమితమైంది. కెప్టెన్ కేఎల్ రాహుల్ (61 బంతుల్లో 68; 8 ఫోర్లు) పోరాటం జట్టును గెలిపించలేకపోయింది. మోహిత్ శర్మకు ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ లభించింది.

కెప్టెన్ ఇన్నింగ్స్...

సాహాతో శుబ్‌మన్ గిల్ (0) ‘ఇంపాక్ట్’ డకౌటైంది. వన్‌డౌన్‌లో కెప్టెన్ హార్దిక్ పాండ్యా అండతో సాహా బౌండరీలతో టైటాన్స్ స్కోరును కదిలించాడు. ఈ జోడీ పవర్‌ప్లేలో 40 పరుగులు చేసింది. ఆ తర్వాత అడపాదడపా ఫోర్లతో 10 ఓవర్ల దాకా వికెట్‌ను కాపాడుకున్నారు. జట్టు స్కోరు 72 వద్ద సాహాను కృనాల్ పాండ్యా అవుట్ చేయగా... తర్వాత వచ్చిన అభినవ్ (3), విజయ్ శంకర్ (10) నిరాశపరచడంతో పెద్ద స్కోరేం కాలేదు. ఆఖరి ఓవర్లలో హార్దిక్ భారీ సిక్సర్లతో స్కోరు పెంచే ప్రయత్నం చేశాడు. 44 బంతుల్లో ఫిఫ్టీ పూర్తిచేసుకున్న పాండ్యా ఆఖరి ఓవర్లో నిష్క్రమించాడు.



కేఎల్ రాహుల్

రాహుల్ ఒంటరి పోరాటం...

లక్నో ముందున్న లక్ష్యం 136 పరుగులు. కష్టమైందో... కఠినమైందో కానే కాదు! ఓపెనింగ్ జోడీ కెప్టెన్ రాహుల్, కైల్ మేయర్స్ (19 బంతుల్లో 24; 2 ఫోర్లు, 1 సిక్స్) పవర్ ప్లేలోనే 53 పరుగులు చేయడంతో లక్ష్యఛేదన సులువుగా సాగింది. మేయర్స్ తర్వాత కృనాల్ పాండ్యా (23 బంతుల్లో 23; 2 ఫోర్లు, 1 సిక్స్) అవుటయ్యేసరికే జట్టు 100 పరుగులను దాటింది. నికోలస్ పూరన్ (1) విఫలమైనా... రాహుల్ క్రీజును అట్టిపెట్టుకోవడంతో ఎవరికీ ఏ బెంగా లేదు. రాహుల్ 38 బంతుల్లో అర్ధశతకం సాధించాడు. ఆఖరి ఓవర్‌కు ముందు 124/3 స్కోరుతో లక్నో పటిష్టంగా ఉంది. కానీ ఆ తర్వాతే మోహిత్ చివరి ఓవర్ అనూహ్యంగా సూపర్ జెయింట్స్‌ను ఓడించింది. కచ్చితత్వం లేని షాట్లతో రాహుల్, స్టొయినిస్ (0)వికెట్లను పారేసుకుంటే... పరుగుల వేటలో ఆయుశ్ బదోని (8), దీపక్ హుడా (2) రనౌటయ్యారు.

స్కోరు వివరాలు

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాహా (సి) హుడా (బి) కృనాల్ 47; గిల్ (సి) బిష్ణోయ్ (బి) కృనాల్ 0; హార్దిక్ పాండ్యా (సి) రాహుల్ (బి) స్టొయినిస్ 66; అభినవ్ (సి) నవీనుల్ హఖ్ (బి) మిశ్రా 3; విజయ్ శంకర్ (బి) నవీనుల్ హఖ్ 10; మిల్లర్ (సి) హుడా (బి) స్టొయినిస్ 6; తెవాటియా (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 135. వికెట్ల పతనం:** 1-4, 2-72, 3-77, 4-92, 5-132, 6-135. **బౌలింగ్:** నవీనుల్ హఖ్ 4-0-19-1, కృనాల్ పాండ్యా 4-0-16-2, అవేశ్ ఖాన్ 3-0-21-0, రవి బిష్ణోయ్ 4-0-49-0, స్టొయినిస్ 3-0-20-2, అమిత్ మిశ్రా 2-0-9-1.

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: రాహుల్ (సి) జయంత్ (బి) మోహిత్ 68; మేయర్స్ (బి) రషీద్ ఖాన్ 24; కృనాల్ (స్టంప్డ్) సాహా (బి) నూర్ అహ్మద్ 23; పూరన్ (సి) హార్దిక్ (బి) నూర్ అహ్మద్ 1; బదోని (రనౌట్) 8; స్టొయినిస్ (సి) మిల్లర్ (బి) మోహిత్ 0; దీపక్ హుడా (రనౌట్) 2; ప్రేరక్ మన్కడ్ (నాటౌట్) 0; రవి బిష్ణోయ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 128. వికెట్ల పతనం:** 1-55, 2-106, 3-110, 4-126, 5-126, 6-127, 7-128. **బౌలింగ్:** షమీ 3-1-18-0, జయంత్ 4-0-26-0, రషీద్ ఖాన్ 4-0-33-1, మోహిత్ శర్మ 3-0-17-2, నూర్ అహ్మద్ 4-0-18-2, హార్దిక్ పాండ్యా 1-0-7-0, రాహుల్ తెవాటియా 1-0-8-0.

మెరుపుల్లో పంజాబ్‌దే గెలుపు



స్యామ్ కరన్

- అదరగొట్టిన స్యామ్ కరన్, హర్‌ప్రీత్
- కీలక వికెట్లు తీసిన అర్ష్‌దీప్
- 13 పరుగులతో ముంబైపై పంజాబ్ కింగ్స్ గెలుపు
- గ్రీన్, సూర్యకుమార్ శ్రమ వృథా

ముంబై: మెరుపుల ప్రతాపంలో పంజాబ్ కింగ్స్ పైచేయి సాధించింది. 13 పరుగుల తేడాతో ముంబై ఇండియన్స్‌ను ఓడించింది. తొలుత పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 214 పరుగులు చేసింది. కెప్టెన్ ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ స్యామ్ కరన్ (29 బంతుల్లో 55; 5 ఫోర్లు, 4 సిక్సర్లు), హర్‌ప్రీత్ సింగ్ (28 బంతుల్లో 41; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరిపించారు. జితేశ్ శర్మ (7 బంతుల్లో 25; 4 సిక్సర్లు) ఆఖర్లో శివమెత్తాడు. గ్రీన్, పియూష్ చావ్లా రెండేసి వికెట్లు తీశారు. తర్వాత భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 201 పరుగులకు పరిమితమైంది. గ్రీన్ (43 బంతుల్లో 67; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), సూర్యకుమార్ (26 బంతుల్లో 57; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), రోహిత్ శర్మ (27 బంతుల్లో 44; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), టిమ్ డేవిడ్ (13 బంతుల్లో 25 నాటౌట్; 2 సిక్స్‌లు) చెలరేగారు. కానీ ఆఖరి ఓవర్ ఫినిషింగ్‌లో అర్ష్‌దీప్ (4/29) నిప్పులు చెరగడంతో ముంబై విజయానికి దూరమైంది. ముంబై గెలుపునకు ఆఖరి ఓవర్లో 16 పరుగులు కావాల్సి ఉండగా... అర్ష్‌దీప్ 2 పరుగులే ఇచ్చి తిలక్ వర్మ (3), నేహల్ వధేరా (0) వికెట్లను విరిచేశాడు.



అర్ష్‌దీప్

స్కోరు వివరాలు

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: షార్ట్ (సి) చావ్లా (బి) గ్రీన్ 11; ప్రభ్‌సిమ్రన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అర్జున్ 26; అథర్వ (బి) చావ్లా 29; లివింగ్‌స్టోన్ (స్టంప్డ్) కిషన్ (బి) చావ్లా 10; హర్‌ప్రీత్ (బి) గ్రీన్ 41; కరన్ (సి అండ్ బి) ఆర్చర్ 55; జితేశ్ (బి) బెహ్రెన్‌డార్ఫ్ 25; షారుక్ నాటౌట్ 0; హర్‌ప్రీత్ బ్రార్ రనౌట్ 5; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 214. వికెట్ల పతనం:** 1-18, 2-65, 3-82, 4-83, 5-175, 6-197, 7-209, 8-214. **బౌలింగ్:** అర్జున్ టెండూల్కర్ 3-0-48-1, బెహ్రెన్‌డార్ఫ్ 3-0-41-1, గ్రీన్ 4-0-41-2, ఆర్చర్ 4-0-42-1, పీయూష్ చావ్లా 3-0-15-2, హృతిక్ షోకీన్ 3-0-24-0.

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి అండ్ బి) లివింగ్‌స్టోన్ 44; ఇషాన్ కిషన్ (సి) షార్ట్ (బి) అర్ష్‌దీప్ సింగ్ 1; గ్రీన్ (సి) స్యామ్ కరన్ (బి) ఎలిస్ 67; సూర్యకుమార్ యాదవ్ (సి) అథర్వ (బి) అర్ష్‌దీప్ 57; టిమ్ డేవిడ్ (నాటౌట్) 25; తిలక్‌వర్మ (బి) అర్ష్‌దీప్ సింగ్ 3; నేహల్ వధేరా (బి) అర్ష్‌దీప్ సింగ్ 0; ఆర్చర్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 201. వికెట్ల పతనం:** 1-8, 2-84, 3-159, 4-182, 5-200, 6-200. **బౌలింగ్:** షార్ట్ 1-0-7-0, అర్ష్‌దీప్ 4-0-29-4, హర్‌ప్రీత్ బ్రార్ 2-0-15-0, స్యామ్ కరన్ 3-0-41-0, ఎలిస్ 4-0-44-1, రాహుల్ చహర్ 4-0-42-0, లివింగ్‌స్టోన్ 2-0-23-1.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	6	4	2	8	1.043
లక్నో	7	4	3	8	0.547
చెన్నై	6	4	2	8	0.355
గుజరాత్	6	4	2	8	0.212
పంజాబ్	7	4	3	8	-0.162
బెంగళూరు	6	3	3	6	-0.068
ముంబై	6	3	3	6	-0.254
కోల్‌కతా	6	2	4	4	0.214
హైదరాబాద్	6	2	4	4	-0.794
ఢిల్లీ	6	1	5	2	-1.183

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

బెంగళూరు x రాజస్తాన్ (మ. గం. 3:30 నుంచి)
కోల్‌కతా x చెన్నై (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

‘కొటక్-పుల్లెల గోపీచంద్ అకాడమీ’ ప్రారంభం



గచ్చిబౌలి: బ్యాడ్మింటన్ క్రీడాకారులకు మరో శిక్షణ కేంద్రం అందుబాటులోకి వచ్చింది. శనివారం గచ్చిబౌలిలో కొటక్ మహీంద్ర బ్యాంక్ లిమిటెడ్ సీఎస్‌ఆర్ అసోసియేట్, పుల్లెల గోపీచంద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ‘కొటక్-పుల్లెల గోపీచంద్ అకాడమీ’ని ప్రారంభించారు. ఈ అకాడమీని అత్యాధునిక మౌలిక వసతులు, అంతర్జాతీయ కోచ్‌లతో ప్రపంచస్థాయి బ్యాడ్మింటన్ శిక్షణ కేంద్రంగా తీర్చిదిద్దుతామని... ఔత్సాహిక, అత్యంత ప్రతిభావంతులైన క్రీడాకారులకు అత్యుత్తమ శిక్షణ ఇస్తామని జాతీయ చీఫ్ కోచ్ గోపీచంద్ వ్యాఖ్యానించారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్‌ఆర్)లో భాగంగా కొటక్ మహీంద్ర బ్యాంక్ భారతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారులకు ప్రపంచస్థాయి శిక్షణ సౌకర్యాన్ని అభివృద్ధి చేసేందుకు సహకారం అందిస్తుందన్నారు. యువత భవిష్యత్ కోసం క్రీడా మౌలిక వసతులు అందించేందుకు గోపీచంద్ అకాడమీతో కలిసి పనిచేస్తామని కొటక్ మహీంద్ర బ్యాంక్ హోల్ టైమ్ డైరెక్టర్ శాంతి ఏకాంబరం పేర్కొన్నారు. కొటక్-పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ శిక్షణ కేంద్రంలో అత్యుత్తమ నాణ్యత గల న్యూట్రీషియనిస్టులు, ఫిజియోథెరపిస్టులు, నిపుణులతో కూడిన స్పోర్ట్స్ సైన్స్ సెంటర్ ఉంటుంది. ఆర్థికంగా వెనుకబడిన కోచ్‌లు, క్రీడాకారుల కోసం ఫెలోషిప్ ప్రోగ్రామ్, బ్యాడ్మింటన్ శిక్షణ పరిధిని విస్తరించేందుకు పూర్వ క్రీడాకారుల కోసం కోచ్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో కొటక్ మహీంద్ర గ్రూప్ ప్రెసిడెంట్, సీఎఫ్ఓ జైమిన్ భట్, ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రమణ్యం, భారత షట్లర్లు సైనా నెహ్వాల్, సిక్కి రెడ్డి, శ్రీకాంత్, సాయిప్రణీత్, పుల్లెల గాయత్రి, ట్రెసా జాలీ, అశ్విని పొన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

చాంపియన్ అర్జున్



అస్తానా (కజకిస్తాన్): సాటీ జుల్డిజ్ ఓపెన్ అంతర్జాతీయ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ చాంపియన్‌గా అవతరించాడు. శనివారం ముగిసిన ఈ టోర్నీలో అర్జున్ నిర్ణీత 11 రౌండ్ల తర్వాత 9.5 పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. శనివారం జరిగిన చివరి మూడు రౌండ్ గేముల్లో అర్జున్ రెండింటిలో గెలిచి, మరో గేమ్‌ను ‘డ్రా’ చేసుకొని ఈ టోర్నీని అజేయంగా ముగించాడు. క్రామ్నిక్ (రష్యా)తో జరిగిన తొమ్మిదో రౌండ్‌లో అర్జున్ 47 ఎత్తుల్లో గెలుపొందగా... అరోనియన్ (అమెరికా)తో జరిగిన పదో రౌండ్‌ను అర్జున్ 24 ఎత్తుల్లో ‘డ్రా’ చేసుకున్నాడు. కాటరీనా లాగ్నో (రష్యా)తో జరిగిన చివరిదైన 11వ రౌండ్ గేమ్‌లో అర్జున్ 58 ఎత్తుల్లో గెలిచాడు.

బోపన్న జోడీ ఓటమి

బార్సిలోనా: బార్సిలోనా ఓపెన్ టెన్నిస్ టోర్నీ డబుల్స్ సెమీఫైనల్లో రోహన్ బోపన్న (భారత్)-ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయం 4-6, 5-7తో వెస్లీ కూలాఫ్ (నెదర్లాండ్స్)-నీల్ స్కప్‌స్కీ (బ్రిటన్) జోడీ చేతిలో ఓడింది. బోపన్న జోడీకి 45,120 డాలర్ల (రూ. 37 లక్షలు) ప్రైజ్‌మనీ దక్కింది.

సినిమా

ఆ ఒక్క సెంటిమెంట్ ఫాలో అవుతున్నా! - అఖిల్

“30 ఏళ్లకు పైగా మా నాన్నగారు (నాగార్జున) ఇండస్ట్రీలో ఉన్నారు కాబట్టి ప్రతి డిపార్ట్‌మెంట్‌లో ఆయనకు మంచి గ్రిప్ ఉంది. నాకేమైనా సందేహాలు ఉంటే ఆయన్ని అడిగి తెలుసుకుంటాను. అయితే ఫలానా స్క్రిప్ట్ ఓకే చేయాలా? వద్దా అని అడగను. అలా చేస్తే నా కెరీర్ తాలూకు ఒత్తిడిని నాన్నపై పెట్టినట్లు ఉంటుంది. ఆయన ప్రమేయం ఎక్కువగా ఉంటే ఓ వ్యక్తిగా నేను ఎదగలేక పోవచ్చు. అందుకే సొంత నిర్ణయాలు తీసుకుంటున్నాను. ఈ కారణంగానే ‘ఏజెంట్’ స్క్రిప్ట్‌ను నాన్నతో షేర్ చేయలేదు” అన్నారు అఖిల్. సురేందర్ రెడ్డి దర్శకత్వంలో అఖిల్ హీరోగా నటించిన చిత్రం ‘ఏజెంట్’. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 28న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా అఖిల్ చెప్పిన విశేషాలు.

● నాకు యాక్షన్ సినిమాలంటే చాలా ఇష్టం. నా గత చిత్రం ‘మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్’ టైమ్‌లో సూరిగారు (సురేందర్ రెడ్డి) ‘ఏజెంట్’ కథ చెప్పారు. నాకూ నచ్చింది. దాంతో వెంటనే అనౌన్స్ చేశాం. అయితే స్క్రిప్ట్ పూర్తి కావడానికి, నా లుక్ మార్చుకోవడం, లాక్‌డౌన్ వంటి వాటి వల్ల ఈ సినిమా ఆలస్యమైంది. ● ‘ఏజెంట్’లో నేను రామకృష్ణ (రిక్కీ) అనే పాత్ర చేశాను. రిక్కీ పాత్ర చాలా కొత్తగా ఉంటుంది. ‘ఏజెంట్’ ఒక మంచి స్పై డ్రామా. సురేందర్ రెడ్డిగారు ప్రతిదీ ఫైన్ ట్యూన్ చేస్తారు. నేను ఆయన్ను బ్లైండ్‌గా ఫాలో అయ్యాను. ఇక సెకండాఫ్‌లో వచ్చే టార్చర్ సీన్ కోసం చాలా కష్టపడ్డాను. ● సాధారణంగా నేను సెంటిమెంట్స్‌ను నమ్మను. అయితే ఏప్రిల్ 28న ‘అడవి రాముడు’, ‘పోకిరి’, ‘బాహుబలి’ వంటి ఎన్నో సక్సెస్‌ఫుల్ సినిమాలు విడుదలయ్యాయి. ఇలాంటి హిట్ సినిమాలు విడుదలైన ఏప్రిల్ 28న ‘ఏజెంట్’ సినిమా విడుదల అవుతోంది. ఈ సెంటిమెంట్‌ను మాత్రం ఫాలో అవుతున్నాను. ● నాన్నగారితో స్క్రీన్ షేర్ చేసుకోవడం అనేది నా కల. అది నాన్నగారి వందో సినిమా అయితే నాకు ఇంకా సంతోషం. ఎప్పటికీ గుర్తుండిపోయే సినిమా అవుతుంది. కానీ నాకు తెలిసి అలాంటి స్క్రిప్ట్ ఏదీ ఫైనలైజ్ కాలేదు. ‘ఏజెంట్’ సినిమా ట్రైలర్ చూసి, నేను చాలా కష్టపడ్డానని తెలిసి మా అమ్మగారు (అక్కినేని అమల) ఎమోషన్ అయ్యారు.




జై శ్రీరామ్.. జై శ్రీరామ్

‘నీ సాయం సదా మేమున్నాం.. సిద్ధం సర్వ సైన్యం.. సహచరులై పదా వస్తున్నాం. సఫలం స్వామి కార్యం’ అంటూ ‘జై శ్రీరామ్’ నామం ప్రతిధ్వనించేలా ‘ఆదిపురుష్’ చిత్రం నుంచి ఓ లిరికల్ వీడియోను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ప్రభాస్ టైటిల్ రోల్‌లో ఓం రౌత్ దర్శకత్వం వహించిన చిత్రం ‘ఆదిపురుష్’. శనివారం ఈ చిత్రం నుంచి 60 సెకన్ల ‘జై శ్రీరామ్’ పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. అజయ్-అతుల్ స్వరపరిచిన ఈ గీతాన్ని హిందీ, తెలుగు, తమిళ, మలయాళం, కన్నడ భాషల్లో విడుదల చేశారు. తెలుగులో రామజోగయ్య శాస్త్రి రాశారు. భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్, ఓం రౌత్, ప్రసాద్ సుతార్, రాజేష్ నాయర్, వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రం జూన్ 16న రిలీజ్ కానుంది.



● ప్రభాస్

ఐ హేట్ లవ్



● సుధీర్‌బాబు

“దేవుడడిగాడంట.. నన్ను చేరడానికి ఏడు జన్మలు నాకు భక్తుల్లా బతుకుతారా...లేక మూడు జన్మలు రాక్షసుల్లా బతుకుతారా అని. ఏడు జన్మలు నీకు దూరంగా ఉండే కన్నా... మూడు జన్మల రాక్షస బతుకే మిన్న అని దేవతలే కోరుకున్నారట’, ‘ఐ హేట్ లవ్’ అనే డైలాగ్స్‌తో విడుదలైంది ‘మామా మశ్చీంద్ర’ టీజర్. సుధీర్ బాబు హీరోగా హర్షవర్ధన్ నటించి, దర్శకత్వం వహించిన చిత్రం ఇది. తెలుగు, హిందీ భాషల్లో రూపొందిన ఈ చిత్రంలో మృణాళినీ రవి, ఈషా రెబ్బా హీరోయిన్లు. సోనాలీ నారంగ్, సృష్టి సమర్పణలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్‌రావు నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. శనివారం ఈ సినిమా టీజర్‌ను హీరో మహేశ్‌బాబు సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఈ చిత్రంలో దుర్గ, డీజే, పరశురామ్ పాత్రలు చేశారు సుధీర్‌బాబు.

చైత్రతో ప్రేమ



● ఇవానా, ఆశిష్

‘రౌడీ బాయ్స్’తో ఆకట్టుకున్న ఆశిష్ రెడ్డి హీరోగా నటిస్తున్న రెండో చిత్రం ‘సెల్ఫిష్’. కాశీ విశాల్ దర్శకత్వంలో సుకుమార్ రైటింగ్స్, ‘దిల్’ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఇవానా కథానాయిక. ఆమె పాత్ర పేరు చైత్ర. ఆందోళనగా ఉన్న చైత్రను హీరో తదేకంగా చూస్తున్న పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. హైదరాబాద్‌లోని పాతబస్తీలో జరిగే ఈ మాస్ లవ్‌స్టోరీలో ఆశిష్ ఓల్డ్ సిటీ కుర్రాడి పాత్ర చేస్తుండగా, ఇవానా ఫైనాన్షియల్ ఎనలిస్ట్ పాత్ర చేస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జె మేయర్, కెమెరా: ఎస్. మణికందన్, సహనిర్మాతలు: హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి, అశోక్ బండ్రెడ్డి.